


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153
# వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 21 | ఆదివారం 21 జూన్, 2026 | పేజీలు : 8 | వెల : 2/-



## కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

**తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి**

•కొత్త ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ తప్పుడు ప్రచారం •బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వస్తారన్న ఎస్ఈవో సుదర్శన్ రెడ్డి •కొత్త ఓటర్లు వారి వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ 2

## సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను
# వేగవంతం చేయాలి

- పెండింగ్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలి
- సెప్టెంబర్ 15 వరకు అధికారులకు గడువు
- పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి ప్రాజెక్టులపై సమీక్ష
- భూ సేకరణ ప్రక్రియను సమర్పించిన కలెక్టర్లు
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు



వార్త సాక్ష్యం జూన్ 20: రాష్ట్రంలో సాగునీటి రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరం లో పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తో పాటు నాగర్‌క ర్నూల్, వనపర్తి, -మిగతా2లో



## తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి జయశంకర్ ప్రేరణ

వార్త సాక్ష్యం :తెలంగాణ జాతిపిత జయశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళి అర్పించారు. ప్రత్యేక తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కీర్తించారు. తెలంగాణ రాష్ట్ర సాధనే జయశంకర్ ఉచ్ఛ్వాస నిశ్వాసలని కొనియాడారు. జయశంకర్ త్యాగాలను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరవదని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు.తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయ సాధనకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రలో విలీనం చేయడాన్ని జయశంకర్ వ్యతిరేకించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విలీనంతో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించిన మహనీయుడు అని కీర్తించారు. -మిగతా2లో

## నరహరి బ్యాంకు లాకర్లలోని రూ.1.50 కోట్ల నగదు, 2.5 కిలోల బంగారం స్వాధీనం




ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిపై అవినీతి, అక్రమాస్తుల ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.ఈ దర్యాప్తును ఏసీబీ అధికారులు ముమ్మరం చేశారు.

## వీబీజీ రామ్‌జీ చట్టంపై కేంద్రానికి మంత్రి సీతక్క లేఖ




**పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలి..**

వార్త సాక్ష్యం : వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి నిరసన లేఖ రాశామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. నూతన చట్టాన్ని ఉపసంహరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. నూతన చట్టంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ మూడు వేర్వేరు లేఖలు కేంద్రానికి పంపించామని వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాల యంలో మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌ను యథాతథంగా కొనసాగించి గ్రామీణ పేదల ఉపాధి హక్కును కేంద్రం కాపాడాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అధికారాలను బలహీనపరిచే నిబంధనలని వెంటనే సవరించాలని విజ్ఞప్తి చేశారు. వీబీజీ రామ్‌జీ నిధుల కేటాయింపు విధానం పేదలు, దళితులు, గిరిజనులకు అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు.-మిగతా2లో



## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం..
# మాపై దుష్ప్రచారం ఆపండి

- హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ ఆగ్రహం
- హైడ్రాను బద్నాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- సిటీలో ఇప్పటి వరకు 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని వెల్లడి
- తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్న రంగనాథ్
- హైడ్రా ఎప్పుడూ మౌనంగా ఉండదని స్పష్టీకరణ

వార్త సాక్ష్యం :హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరా బాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు 2లో

## పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు
# భగీరథ్‌కు బెయిల్

- పోక్సో కేసులో నెల రోజులుగా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్
- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన మల్కాజ్‌గిరి కోర్టు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారిన భగీరథ్ వ్యవహారం



వార్త సాక్ష్యం : తెలంగాణలో గత నెల రోజులుగా హాట్ టాపిక్‌గా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భగీరథ్‌కు ఎట్టకేలకు మల్కాజ్‌గిరి కోర్టులో ఊరట లభించింది. దాదాపు నెల రోజులుగా చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అతనికి న్యాయస్థానం షరతులతో 2లో

## పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

- 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 18,880 కోట్లు జమ
- ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం
- పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ నుంచి నిధుల బదిలీ కార్యక్రమం



వార్త సాక్ష్యం : ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు -మిగతా2లో

# నిరాహార దీక్ష చేస్తా:
## కాంగ్రెస్ ప్రభుత్వానికి కవిత వార్నింగ్



- సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లాలోని గనిని సందర్శించిన కవిత
- మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న 1200 మంది వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్
- ఉద్యోగాలు ఇవ్వకపోతే జులై 20 నుంచి నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరిక

వార్త సాక్ష్యం :సింగరేణి 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-5 గనిని -మిగతా2లో

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

-మొదటిపేజీ తరువాయి :శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ అంశాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి , గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో ప్రాజెక్టుల వారీగా, నియోజకవర్గాల వారీగా భూసేకరణ పురోగతిని మంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు. ఇప్పటివరకు ఎంత భూమి సేకరించబడింది, ఎంత భూమి పీడీ (ప్రాథమిక నోటిఫికేషన్) దశలో ఉంది, ఎంత భూమి పీఎం స్థాయిలో ఉంది, ఎన్ని అవార్డులు ప్రకటించారు, ఎంత పరిహారం చెల్లించారు, ఇంకా ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయనే అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ......, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల జిల్లాలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. ఆ దిశగా అధికారులు మరింత బాధ్యతతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న సమస్యలను సెప్టెంబర్ 15లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, సాగునీటి వనరుల విస్తరణ ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి వంటి ప్రాజెక్టులు పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా భూగర్భ జలాల మట్టం పెరిగి వ్యవసాయ రంగానికి కొత్త ఊపు వస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల ఆశలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.



భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకూడదని మంత్రి స్పష్టం చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందించడమే కాకుండా వారి సమస్యలను మానవీయ దృక్పథంతో పరిశీలించాలని సూచించారు. రైతుల అభ్యంతరాలు, భూవివాదాలు, పరిహారం చెల్లింపులకు సంబంధించిన అంశాలను ప్రత్యేకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

**ప్రజల సహకారంతోనే ప్రాజెక్టులు**

ప్రజల సహకారంతోనే ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయని, అందుకే రైతుల విశ్వాసాన్ని పొందే విధంగా అధికారులు వ్యవహరించాలని సూచించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. ప్రతి 15 రోజులు పురోగతిని సమీక్షిస్తూ నిర్ణీత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వేగవంతమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి,

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ....., జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే రైతాంగానికి శాశ్వత ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. సాగునీటి అందుబాటు పెరగడం ద్వారా వలసలు తగ్గి గ్రామీణ జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పరిష్కరించి పనులను మరింత వేగవంతం చేయాలని కోరారు.

రైతులకు అందాల్సిన పరిహారంపై రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి అందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయించేలా మంత్రి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలవనున్నట్లు తెలిపారు.

**భూ సేకరణ ప్రక్రియను సమర్పించిన కలెక్టర్లు**

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌లు తమ తమ జిల్లాల పరిధిలో కొనసాగుతున్న భూసేకరణ ప్రక్రియపై సమగ్ర నివేదికలను సమర్పించారు. ఇప్పటివరకు జరిగిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, పెండింగ్‌లో ఉన్న కేసులు, కోర్టు వివాదాలు, రైతుల అభ్యంతరాలు తదితర అంశాలపై వివరాలు వెల్లడించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తమ నియోజకవర్గాల్లోని రైతుల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పరిహారం చెల్లింపులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పారదర్శకంగా భూసేకరణ ప్రక్రియ కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. ప్రాజెక్టుల వారీగా సేకరించిన భూమి, చెల్లించిన పరిహారం, పెండింగ్ పనులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను సమర్పించారు. నిర్ణీత గడువులోగా భూసేకరణ పూర్తిచేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో పాలమూరు రంగారెడ్డి విజయభాస్కర్ రెడ్డి, అదనపు కలెక్టర్ అమరేందర్, సాగు నీటి ప్రాజెక్టుల ఎస్సీలు, ఈ.ఈలు, ఏఈలు ఆర్డీవోలు, తాహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్‌జీ చట్టంపై కేంద్రానికి మంత్రి సీతక్క లేఖ

-మొదటిపేజీ తరువాయి : రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చూడకుండా గ్రామస్థాయి ఉపాధి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ఆదిలాబాద్, ములుగు, కుమురంభీం, ఆసిఫాబాద్ వంటి వెనుకబడ్డ ప్రాంతాల అవసరాలు విస్మరించొద్దని అన్నారు. గ్రామ పంచాయతీల్లో నమోదైన వాస్తవ పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలని సూచించారు. నిధుల పంపిణీ విషయంలో కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పుకొచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వీబీజీ రామ్‌జీ పరిధిలో అనుమతించాలని కోరారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు గతంలోలాగే 90 రోజుల ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత భూ అభివృద్ధి పనులను తొలగిస్తే చిన్న రైతులకు నష్టమని చెప్పారు.జీవనోపాధి పనులను కొనసాగించాలి.ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులకు ఉపయోగపడే జీవనోపాధి పనులను కొనసాగించాలని మంత్రి సీతక్క సూచించారు. వరదలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ, న్యూట్రి గార్డెన్లు, వెదురు తోటలకు అనుమతి ఇవ్వాలని కోరారు. 60 రోజుల తప్పనిసరి ఉపాధి విరామం గ్రామీణ పేదల ఆదాయాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాలు, నీటి ఎద్దడి ప్రాంతాలకు 60 రోజుల నిషేధం నుంచి మినహాయింపు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ పనులకు ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మొక్కల పెంపకం, అటవీకరణ కార్యక్రమాలకు ఉపాధి విరామం వర్తింపజేయొద్దని అన్నారు. దళితులు, గిరిజనులు, భూమిలేని కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చట్టంలో మార్పులు చేయాలని మంత్రి సీతక్క సూచించారు.

# రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

-మొదటిపేజీ తరువాయి : ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు. హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం" అని స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. "లక్ష మంది ప్రజలకు మంచి చేయాలనుకున్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు" అని తేల్చిచెప్పారు.

# పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

-మొదటిపేజీ తరువాయి : ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది. 'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్' సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ pmkisan.gov.in వెబ్‌సైట్‌లోని 'ఫార్మర్స్ కార్నర్'ను సందర్శించవచ్చు.

# తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి జయశంకర్ ప్రేరణ

-మొదటిపేజీ తరువాయి :హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రలో విలీనం చేయడాన్ని జయశంకర్ వ్యతిరేకించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విలీనంతో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించిన మహనీయుడు అని కీర్తించారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా ఉంచిన ఘనత జయశంకర్‌దేనని చెప్పారు. తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి జయశంకర్ మార్గదర్శి అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి జయశంకర్ కృషి చిరస్మరణీయమని ప్రశంసించారు. మహనీయుడి ఆశయాల సాధనలో తమ ప్రభుత్వం ముందుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

-మొదటిపేజీ తరువాయి : తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై ఈరోజు హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వయంగా రానున్నారు. వారు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు ముగించుకుని అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.

# నరహరి బ్యాంకు లాకర్లలోని రూ.1.50 కోట్ల నగదు, 2.5 కిలోల బంగారం స్వాధీనం

-మొదటిపేజీ తరువాయి : ఈక్రమంలో నరహరికి సంబంధించిన బ్యాంకు లాకర్లను బద్దలు కొట్టి కీలక ఆధారాలను సేకరించారు. నరహరి కుటుంబ సభ్యులు లాకర్ తాళాలను అందించేందుకు సహకరించకపోవడంతో, న్యాయస్థానం అనుమతి తీసుకుని ఏసీబీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కోర్టు జారీ చేసిన సెర్చ్ వారెంట్ ఆధారంగా బ్యాంకు అధికారుల సమక్షంలో లాకర్లను బద్దలు కొట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రక్రియ మొత్తం నిబంధనల ప్రకారం జరిగింది. ఈ సోదాల సమయంలో లాకర్లలో భారీ మొత్తంలో నగదు, బంగారం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. లాకర్‌లో రూ.1.50 కోట్ల నగదుతో పాటు సుమారు రెండున్నర కిలోల బంగారం లభించింది. స్వాధీనం చేసుకున్న బంగారం విలువను అధికారులు అంచనా వేస్తున్నారు. లాకర్లలో దొరికిన నగదు, బంగారానికి సంబంధించిన పత్రాలను కూడా ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. అవసరమైతే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు రికార్డులు, పన్ను వివరాలను కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. భారీ మొత్తంలో నగదు, బంగారం బయటపడటంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఏసీబీ అధికారులు సేకరించిన ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

# పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు భగీరథ్‌కు బెయిల్

-మొదటిపేజీ తరువాయి : ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో భగీరథ్‌పై కఠినమైన పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కొడుకు కావడం, పైగా సున్నితమైన కేసు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిన భగీరథ్.. మే 17న పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యాడు. ఆ తర్వాత మేడ్చల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవడంతో నెల రోజులకు పైగా జైల్లోనే గడపాల్సి వచ్చింది. తాజాగా ఇంజినీరింగ్ పరీక్షల నేపథ్యంలో, భగీరథ్ కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో, భగీరథ్ జైలు నుంచి బయటకు రానున్నారు.

# హైదరాబాద్‌కు వర్ష సూచన..

తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆకాశం దట్టమైన మేఘాలతో కమ్ముకోవడంతో పాటు, ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది.

సంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, యాదాద్రి-భువనగిరి, నల్గొండ, జనగామ, సూర్యాపేట జిల్లాల్లో రాబోయే కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ నగర శివార్లలోని నారపల్లి, రాంపల్లి, ఘట్‌కేసర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, హయత్‌నగర్, నాగోల్ వంటి ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు కురిశాయి. రాత్రికి నగరం అంతటా వర్షాలు విస్తరించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

# నిరాహార దీక్ష చేస్తా: కాంగ్రెస్ ప్రభుత్వానికి కవిత వార్నింగ్

-మొదటిపేజీ తరువాయి : సింగరేణి 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న దాదాపు 1200 మంది వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఒక నెల రోజులు టైమ్ ఇస్తున్నామని, ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకపోతే జులై 20 నుంచి తాను నిరాహార దీక్షకు కూర్చుంటానని సింగరేణిలో ఏ చిన్న పని జరగాలన్నా నేరుగా డిప్యూటీ సీఎం ఆఫీస్ నుంచే లంచాలు అడుగుతున్నారంటూ కవిత సంచలన ఆరోపణ చేశారు. కాంగ్రెస్ పాలనలో లాభాల్లో ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. మొన్న జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడికి తీవ్ర గాయాలవడానికి యాజమాన్యం వాడుతున్న నాసిరకం డిటోనేటర్లే కారణమన్నారు. గనుల లోపల పని చేసే కార్మికులకు కనీసం స్వచ్ఛమైన గాలి, మంచి నీరు కూడా ఇవ్వకుండా అధికారులు కక్కుర్తి పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ అవుట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి.

- ఆత్మకూరులో పిఎఫ్ సమస్య పరిష్కరించాలి
- ఏఐటీయూసీ ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతాం

ఆత్మకూరు జూన్ 20 వార్త సాక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించాలని రద్దు చేసే రెగ్యులర్ చేయాలని లేని పక్షంలో చలో విజయవాడ తప్పదని ఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం. రమేష్ బాబు, సీపీఐ తాలూకా కార్యదర్శి టి ప్రతాప్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి దూద్ పీర్ లు హెచ్చరించారు. శనివారం రాష్ట్ర వ్యాప్త పిలుపు లో భాగంగా మున్సిపల్ యూనియన్ కార్యదర్శి బీసన్న అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయం ముందు మోకాళ్ళ పై నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సరిగ్గా రెండేళ్ల క్రితం ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఔట్సోర్సింగ్ కార్మికులను క్రమక్రమంగా రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి అంతేకాకుండా జీతాలు పెంచుతామని చెప్పి ఇప్పటివరకు మున్సిపల్ కార్మికులకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదని వారు మండిపడ్డారు. ఉదయమే అందరి ఆరోగ్య రక్షణ కై రోడ్డు మీదకు వచ్చి వాన,ఎండ, చలిని లెక్క చేయక చెత్త ఈడుస్తూ నగరాన్ని అందంగా తీర్చిదిద్దే రోడ్డు మీద ఉండే మున్సిపల్ కార్మికుల బతుకులు చాలా దారుణంగా ఉన్నాయనివారు అన్నారు ఎమ్మెల్యే మంత్రుల జీతాలు క్రమక్రమంగా పెంచుకుంటూరు కానీ రోడ్డు మీద ఉండే కార్మికుల్ని జీతాలు పెంచడంలో మాత్రం అలసత్వం కనబడుతుందని వారు విమర్శించారు.అనేక రాష్ట్రాల్లో ఔట్సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచుతున్నారని అనేక రాష్ట్రంలో కార్మికులు ను రెగ్యులర్ చేశారని, పలుమార్లు సుప్రీంకోర్టు హైకోర్టు ఔట్సోర్సింగ్ కార్మికుల్ని రెగ్యులర్ చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చిన అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నకు




ఇబ్బంది ఏమిటో అర్థం కావటం లేదన్నారు.ప్రభుత్వ సొమ్ముతో ఇతర దేశాలు తిరగడానికి డబ్బులు వృధా చేయడానికి డబ్బులు ఉంటాయే కానీ కార్మికులు జీతాలు పెంచడానికి సక్రమంగా జీతాలు ఇవ్వడానికి డబ్బులు మాత్రం ఉండవుని ఆర్థిక ఇబ్బందని చెప్తారని ఆర్థిక ఇబ్బంది అనే కుంటి శాఖలు చెప్తారని వుథు ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూరు లో కార్మికులకు రావాల్సిన 2016నుండి 2019వరకు 100మంది కార్మికుల 3సంవత్సరాల పిఎఫ్ విషయం పై అధికారులు స్పందించాలన్నారు.ఇప్పటికి 14మంది చనిపోయారని అన్యాయనికి గురయ్యారన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఆమరణ దీక్ష కి దిగుతామన్నారు. ఇప్పటికైనా మీనమేషాలు లెక్కించకుండా ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని లేని పక్షం లో విజయవాడ దిగబందిస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ పట్టణ నాయకులు లల్లూ, అహమద్,మున్సిపల్ కార్మికులు మురారి నాగరాజు, నరసింహులు, రూతమ్మ, సుశీలమ్మ, దొరస్వామి, శంకర్రావు కార్మికులు పాల్గొన్నారు

# అన్నదాత సుఖీభవ మొదటి విడత- పీఎం కిసాన్ నిధుల విడుదల.

నందికొట్కూరు జూన్ 20 వార్త సాక్ష్యం

నందికొట్కూరు పట్టణంలో సాయిబాబా దేవాలయ ఫంక్షన్ హాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ కార్యక్రమం శనివారం నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య హాజరై వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే జయ సూర్య మాట్లాడుతూ సాగుభూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి, అటవీ భూమి సాగుదారు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వము రూ. 6వేలు ఎరసి సంవత్సరానికి రూ. 20 వేలు చొప్పున ఆర్థిక సహాయం రైతులకు అందజేస్తున్నాం అన్నారు. ఈ పథకం 2025 సంవత్సరంలో మొదటి విడతగా రూ. 5000/- అన్నదాత సుఖీభవ పథకం క్రింద రూ.2000/- పి.ఎం. కిసాన్ పథకం క్రింద అర్హులైన రైతులకు అందజేయడం జరిగిందని అన్నారు అదేవిధంగా రెండో విడతగా రూ.5000/- అన్నదాత సుఖీభవ రూ.2000/- పిఎం కిసాన్ క్రింద రైతులకు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు రైతులకు అన్నదాత సుఖీభవ మూడవ విడతగా రూ.4000/- వేల రూపాయలు 22వ విడతగా 2000/- రూపాయలు పీఎం కిసాన్ కింద అందజేసేందుకు కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని వివరించారు. 2026 సంవత్సరం మొదటి



విడతగా రూ. 5000/- అన్నదాత సుఖీభవ పథకం క్రింద మరియు రూ.2000/- పి.ఎం. కిసాన్ పథకం క్రింద నందికొట్కూరు నియోజకవర్గ మొత్తం 36734 అర్హులైన రైతులకు 24.94/- కోట్లు విడుదల చేయడం జరిగింది అన్నారు రైతులకు ఇచ్చిన మాట నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, సొసైటీ చైర్మన్లు, రైతులు, ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల దేవస్థానంలో విస్తృతంగా మొక్కలునాటే కార్యక్రమము

- దేవస్థాన పరిధిలో పర్యావరణ పరిరక్షణ చేసేందుకు మొక్కల పెంపకం
- ఈ వర్షాకాలంలో ఐదు వేల మొక్కలు నాటాలని నిర్ణయం
- మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ధర్మకర్తల మండలి

శ్రీశైలం జూన్ 20 వార్త సాక్ష్యం

శ్రీశైలం పుణ్యక్షేత్రం పరిధిలో ఈ వర్షాకాలం ముగిసేలోగా పలుచోట్ల ఐదువేల మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్నాయుడు పేర్కొన్నారు. శనివారం శ్రీశైలంలో జిలా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఆలయ కార్యనిర్వ హణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్షేత్రపరిధిలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని ఆలయ పరిధిలో ఉన్న వలయ రహదారికి ఇరువైపులా మరిన్ని మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆరుబయలు ప్రదేశాలలో, దేవస్థానం ఉద్యానవనాలలో మొక్కలను విస్తృతంగా నాటాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అవసరమైనచోట్ల నాటిన మొక్కలకు ట్రిగార్డ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు అనంతరం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ నాటిన చెట్ల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆ మొక్కలను సంరక్షణ చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు దేవస్థానం ఉద్యానవనాలలో మరిన్ని సుందరీకరణ మొక్కలను నాటి భక్తాదులకు పర్యాటకులకు కనువిందు చేసే విధంగా పచ్చటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించి పర్యావరణ సంరక్షణ కోసం ఆలయ అధికారులు మొక్కల పెంపకం పై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలియజేశారు ఆరుబయలు



ప్రదేశాలలో నీడనిచ్చే మొక్కలను నాటడం వల్ల రాబోయే భావితరాలలో పర్యావరణం కాపాడుకునే వారు అవుతారని సూచించారు ఆధ్యాత్మికత కల్పించేందుకు అనువైన చోట్ల దేవతా వృక్షాలను నాటాలని పేర్కొన్నారు. నాటిన మొక్కలలో 30 నుంచి 40శాతం దాకా దేవతా వృక్షాలు ఉండాలని తెలిపారు సంప్రదాయబద్ధంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించి నిర్విఘ్నంగా జరగాలని సంకల్పపూర్వకంగా గణపతిపూజ చేసి ఆ తరువాత వృక్షపూజలు నిర్వహించి మొక్కలను నాటరు కదంబం, తెల్లమద్ది, బాదం, బాహునియా, టుబుబియా రోజియా, స్పెతోడియా మొదలైన మొక్కలను ఆలయ ప్రాంగణంలో నాటారు. కార్యక్రమములో శ్రీస్వామివారి ప్రధానార్చకులు, ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యులు హెచ్. వీరయ్యస్వామి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు పి. మురళీబాలకృష్ణ, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు, ఉద్యానవన అధికారి ఎస్. లోకేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెలుగోడు పట్టణంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా

- రైతుల శ్రేయస్సు కోసం పాటుపడే ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వం
- రైతన్నలకు నియోజకవర్గంలో రెండు కారు పంటలకు సాగునీరు అందించడమే లక్ష్యం
- శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

వెలుగోడు జూన్ 20 వార్త సాక్ష్యం



వెలుగోడు మండల కేంద్రంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2026-27 మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి శనివారం హాజరయ్యారు ముందుగా వ్యవసాయ శాఖ అధికారులు సింగిల్ విండో చైర్మన్లు టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆహ్వానం పలికారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా " అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ " పథకంలో భాగంగా రైతన్నలకు ఏడాదికి రూ.20,000/- వేలు ఆర్థిక సాయం. మొదటి విడత నిధుల విడుదల సందర్భంగా ఒక్కో రైతుకు రూ.7000/- లు చొప్పున ఖాతాలో జమ చేసిన ఎన్డీయే ప్రభుత్వం, రైతన్నలకు ఇచ్చిన మాట కోసం కూటమి ప్రభుత్వం ముందుందని వివరించారు. రైతన్నలతో మమేకమై ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన మార్కెటింగ్, సాగునీటి భద్రత ప్రకృతి వ్యవసాయం పై ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడారు ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు వ్యవసాయ శాఖ అధికారులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వార్త సాక్ష్యం ఎడిటర్ కు సిపిఐ ఏఐటీయూసీ, నాయకుల ఆధ్వర్యంలో ఘన సన్మానం

ఆత్మకూరు జూన్ 20 వార్త సాక్ష్యం



శనివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయం నందు వార్త సాక్ష్యం ఎడిటర్ సగి నాల రవికుమార్ కు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు, సిపిఐ ఆత్మకూరు తాలూకా కార్యదర్శి టి. ప్రతాప్, సహాయ కార్యదర్శి అహ్మద్ హుస్సేన్, ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు ఏ. బీసన్న, దూద్ పీరా, ఏఐటీయూసీ హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు లల్లు మున్సిపల్ వర్కర్స్, హమాలి వర్కర్స్ కలిసి సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో సిపిఐ నాయకులు మాట్లాడుతూ పత్రిక రంగంలో ప్రజల పక్షాన ఉంటూ ప్రజలు పడుతున్న కష్టసుఖాలను తెలుసుకొని పత్రిక ద్వారా అధికారులకు ప్రజా ప్రతినిధులకు తెలియజేస్తూ నేడు ఆత్మకూరు పట్టణంలో రెండు తెలుగు రాష్ట్రాలలో సొంత పత్రికను స్థాపించి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు అధికారుల కు ప్రజలకు వారధిగా పనిచేస్తూ పత్రిక రంగంలో అంచలంచెలు గా ముందుకు వెళ్లాలని వివరించారు.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ మొదటి విడత కార్యక్రమం ప్రారంభం

- మండల వ్యవసాయ శాఖ అధికారిని కే. హేమలత
- రైతన్నల శ్రేయస్సు కోసం పాటుపడే ప్రభుత్వం కూటమి
- ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ ఏ.షహబుద్దీన్



ఆత్మకూరు జూన్ 20 వార్త సాక్ష్యం

అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్ 2026-27 సంవత్సరానికి గఅన్నదాత సుఖీభవ మొదటి విడత పీఎం కిసాన్ 23వ విడత నగదు జమ కార్యక్రమం శనివారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి కె.హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి మండలానికి సంబంధించి అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండు కలిపి 7257 మంది రైతులకు గాను నాలుగు కోట్ల 93 లక్షలు రూపాయలు రైతుల ఖాతాలలో జమ కావడం జరిగిందని వివరించారు ముందుగా పీఎం. మరియు సీఎం లైవ్ టెలికాస్ట్ కార్యక్రమాన్ని రైతులతో కలిసి వీక్షించారు. ఆ తర్వాత రైతులకు చెక్కు పంపిణీ చేశారు ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కార్యక్రమం కింద రైతన్నలకు ప్రతి సంవత్సరం ఖరీఫ్ సీజన్లో విడతలవారీగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్ పీఎం కింద రైతుల ఖాతాలలో నగదు డబ్బులు జమ చేయడం జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేంద్రుడు డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు డిప్యూటీ తహసిల్దార్ ఆంజనేయులు టిడిపి మండల అధ్యక్షుడు రవీంద్రబాబు ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్, ఆత్మకూరు పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం భాష పట్టణ రైతు సంఘం నాయకులు అశ్రఫ్ అలీ మండల ప్రధాన కార్యదర్శి షేక్ నభి , క్లస్టర్ ఇంచార్జి దినకర్ రావు మాజీ ఎంపిటిసి శివ శంకర్ శర్మ వివిధ గ్రామాల రైతులు శివారెడ్డి, నాగేంద్రరావు వ్యవసాయ శాఖ ప్రకృతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల తిరుపతి ప్రసాదం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి అందజేత

- అభిమానం చాటుకున్న ఆత్మకూరు ఆర్యవైశ్య టిడిపి నాయకుడు కొప్పారపు రవి ప్రసాద్
- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాలను బహుమతి

ఆత్మకూరు జూన్ 20 వార్త సాక్ష్యం



తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాల తో సుఖ సంతోషాలతో ఉండాలని తిరుమల తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిని దర్శించుకొని వైకుంఠ కలియుగ స్వామి దర్శనం ముగించుకొని శనివారం శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి ఆత్మకూరు టిడిపి ఆర్యవైశ్య నాయకుడు కొప్పారపు రవి ప్రసాద్ తిరుమల తిరుపతి ప్రసాదం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాలను బహుమతిగా అందించారు ఎమ్మెల్యే స్వగ్రామం వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామంలో ఆర్యవైశ్య నాయకుడు కొప్పారపు రవి ప్రసాద్ తన అభిమానాన్ని చాటుకొని కలియుగ దైవ దర్శనం చేసుకున్నారు వీరి వెంట పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం భాష, టిడిపి మండల అధ్యక్షుడు, రవీంద్రబాబు, క్లస్టర్ ఇంచార్జి కమతం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక


# కూటమి ప్రభుత్వంలో పోలీసులు రాజకీయ తొత్తులుగా మారారు... వైసీపీ లీగల్ సెల్

నంద్యాల జూన్ 20 వార్త సాక్ష్యం

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో పోలీసులు రాజకీయ తొత్తులుగా మారారని నంద్యాల లీగల్ సెల్ నాయకులు సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం నంద్యాలలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ లీగల్ సెల్ ప్రతినిధుల సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో నంద్యాల జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, నంద్యాల అధ్యక్షుడు ప్రతాప్రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు స్టేట్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ తిమ్మారెడ్డి, ఆర్టీఏ నంద్యాల అసెంబ్లీ వింగ్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రీవెన్స్ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు వివేకానందరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ జగన్ మోహన్ రెడ్డి, సాయిరాం రెడ్డి, మదాని, సోహేల్ రాణా, ద్వారకానాథ్, శరత్, రామాంజనే యులు, వసంత్ రెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నంద్యాల వైసీపీ లీగల్ సెల్ నాయకులు మాట్లాడుతూ...రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో అరాచకాలు, దౌర్జన్యాలు, సోషల్ మీడియా ఆక్టివిస్ట్లపై వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అనవరస కేసులు నమోదు చేస్తు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సమాజంలో పోలీసుల పాత్ర అత్యంత ప్రధానమైనదని, అయితే నేడు కూటమి ప్రభుత్వంలో వారు రాజకీయతొత్తులుగా మారారని సంచల వ్యాక్యలు చేశారు. ఇటీవల కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో కృష్ణవంశీ అనే యువకున్ని లాకప్ డెత్ జరిగిన ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి కృష్ణ వంశీ లాకప్ డెత్ గురించి తెలుసుకోవడం జరిగిందని అంతవరకు కనీసం స్పందించని పోలీసులు



నేడు కృష్ణలంక సీఐపై కేసు నమోదు చేశారన్నారు. పోలీసు వ్యవస్థ రాష్ట్రంలో నిర్వీర్య అయ్యిందని విమర్శించారు. రాష్ట్రంలో మంత్రులు ఉన్నా అందరిని కేవలం మంత్రి లోకేష్ నియంత్రించడం జరుగుతుందని వారు పేరుకు మాత్రమే మంత్రులన్నారు. జూనియర్ న్యాయవాధుల విషయంలో నాడు వైసీపీ ప్రభుత్వం 5వేల రూపాయలను ఇవ్వడం జరిగిందని, అయితే ఎన్నికల సందర్భంగా జూనియర్ న్యాయవాధులకు నెలకు 10వేల రూపాయులు ఇస్తానని నమ్మించి నేటికి ఇవ్వలేదని మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను హామీలను నెరవేర్చలేదని పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాల్లో మోసాలు, రైతులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లేదని కేవలం వైసీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

# వడ్ల రామాపురం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించండి

- ఇందిరమ్మ కాలనీలో తాగునీరు అందక మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన
- వ్యవసాయ కార్మిక సంఘం నరసింహ నాయక్

ఆత్మకూరు జూన్ 20 వార్త సాక్ష్యం



మండల పరిధిలోని వడ్లరాంపురం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం నరసింహ నాయక్ ఆధ్వర్యంలో శనివారం గ్రామంలోని ఇందిరమ్మ ఎస్సీ కాలనీ ప్రజలు గ్రామ సచివాలయం మందు ధర్నా చేసి అడ్మిన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహ నాయక్ మాట్లాడుతూ గ్రామంలో మూడు నెలల నుండి తెలుగు గంగ పైప్ లైన్ ద్వారా వచ్చే నీరు దుర్వాసనతో అరకొర నీళ్లు వస్తున్నాయని కాలనీలో అనేక చోట్ల లీక్ అయ్యి నీరు వేస్ట్ గా పోతున్నాయి అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా చీమకుట్టినట్టు కూడా లేదు కాలనీ ప్రజలు నీళ్ల లేక ఇంట్లో బట్టలు ఉతకాలన్న స్థానాలు చేయాలన్న దూర ప్రాంతాల నుంచి నీళ్లు తెచ్చుకొని జీవనం సాగిస్తున్నారు కావున ప్రభుత్వం తక్షణమే తెలుగు గంగ పైపులైను లీకులను మరమ్మత్తులు చేసి నీళ్ల ఇవ్వాలి, లేదా ప్రత్యామ్నాయంగా కాలనీలో ఉన్న బావిలో మోటర్ వేసి కాలనీ ప్రజలకు వాడుకోవడానికి నీళ్లు ఇవ్వాలి, లేదా బోరు వేసి నీళ్ల అందించాలి కాలనీలో ఉన్న వాటర్ ట్యాంకు శుభ్రం చేయాలి, ట్యాంక్ ద్వారా కాలనీలో మంచినీటి సౌకర్యం కల్పించాలి ప్రతి ఇంటికి కులాయి ద్వారా మంచినీరు ఇవ్వాలి జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఇందిరమ్మ ఎస్సీ కాలనీకి నీళ్ల ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహేశ్వరమ్మ, శ్రీరాములు, పెద్ద శ్రీను, జ్యోతి, రమాదేవి, చిన్న లింగమ్మ రమణ, దేవి, నాగ స్వామి, జానకమ్మ, సుశీల, పార్వతమ్మ, రాజమ్మ గౌరమ్మ వెంకట లింగమ్మ మరియమ్మ, లక్ష్మణ కాంతమ్మ, సుజాత, వెంకటమ్మ, దుర్గ ప్రసాద్, రామలింగయ్య, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలి





- అక్కినేపల్లి, లింగంపల్లి ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన
- జిల్లా కలెక్టర్ అంకిత్..

జూన్ 20 వార్త సాక్ష్యం

జిల్లాలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, నాన్-క్యాడస్ట్రల్ సర్వే, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం దమ్మపేట మండలంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దమ్మపేట మండలం అక్కినేపల్లి గ్రామంలో చేపడుతున్న నాన్-క్యాడస్ట్రల్ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియ, భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు విధానాలను అడిగి తెలుసుకుని పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం దమ్మపేట మండలం లింగంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1458లో కొనసాగుతున్న ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. అటవీ మరియు రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించి, భూముల సరిహద్దుల నిర్ధారణలో ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ అక్కినేపల్లి గ్రామ పరిధిలో సుమారు 4,400 ఎకరాల విస్తీర్ణంలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పనులు ప్రణాళికాబద్ధంగా జరుగుతు న్నాయని తెలిపారు. మరో రెండు నెలల్లో సర్వే ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు వివరించారు. దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మ్యాప్ ద్వారా పరిశీలించి, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టు పనులకు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారణ కావడంతో పాటు భవిష్యత్తులో తలెత్తే వివాదాలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే, భూసేకరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి మధు, దమ్మపేట తాసిల్దార్ రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ రావు,సర్వేయర్ నాగరాజు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మానవతా సేవలో పోలీసు శాఖ

- వృద్ధులకు పండ్లు,నిత్యావసర సరుకులు పంపిణీ
- "మా" అభాగ్యుల వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ




జూన్ 20 వార్త సాక్ష్యం

గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మా అభాగ్యుల వృద్ధాశ్రమాన్ని శనివారం రోజున జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సందర్శించారు.ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు,అవసరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం వృద్ధులకు పండ్లు,బియ్యం,కిరాణా సరుకులు మరియు ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.సమాజంలో వృద్ధులు,నిరాశ్రయులు,అనాథల సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.వృద్ధుల సేవ చేయడం గొప్ప మానవతా ధర్మమని,వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. అవసరమైన వారికి సేవలు అందించడంలో జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్,ఎస్.ఐ శ్రీకాంత్ వృద్ధాశ్రమ సభ్యులు ఉన్నారు.

# జిల్లాకు మరింత గుర్తింపు తేవాలి

- ప్రభుత్వ విప్ విజయరమణారావు
- జిల్లా కలెక్టర్ కు ఘన సన్మానం

జూన్ 20 వార్త సాక్ష్యం



విద్య ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లా అగ్రగామిగా నిలిచినందుకు చాలా ఆనందంగా ఉందని, జిల్లాకు మరింత గుర్తింపు తెచ్చేలా పని చేయాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. జిల్లాను విద్యా ప్రమాణాల పెంపులో అగ్రగామిగా నిలిపినందుకుగానూ హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో తెలంగాణ గవర్నర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల చేతుల మీదుగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షని అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీహర్షను ప్రభుత్వ విప్ విజయరమణారావు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపు విషయంలో కా ఎద్దపల్లి జిల్లాకు గుర్తింపు రావడం ఎంతో గొప్ప విషయమని, రానున్న రోజుల్లో పెద్దపల్లి జిల్లాకు మరెన్నో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన

- మధిర జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల



జూన్ 20 వార్త సాక్ష్యం

మధిర కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మధిర జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర రాజీ ద్వారా త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. న్యాయస్థానాల్లో సంవత్సరాల పాటు కొనసాగే వివాదాలను సులభంగా, తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో పరిష్కరించేందుకు లోక్ అదాలత్‌లు ఉత్తమ వేదికలని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా చెక్కు బౌన్స్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, బ్యాంకు రుణాలు, కుటుంబ వివాదాలు తదితర కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అనేక సివిల్ మరియు క్రిమినల్ కేసులను ప్రజల ముందు పరిష్కరించి అవార్డు కాపీలు అందజేశారు. లోక్ అదాలత్‌లో కుదిరిన రాజీ తీర్పులకు చట్టబద్ధత ఉండటంతో పాటు వాటిపై అప్పీల్‌కు అవకాశం ఉండదని, ఇరు పక్షాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆమె వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చావలి రామరాజు,ఏపీ పి జన్ను భద్రయ్య,పట్టణ సీఐ రమేష్,సబ్ ఇన్స్పెక్టర్స్ నవిత, విశ్వ తేజ,ఎం అబ్రహాం సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, డి జగన్మోహన్ రావు,బి పుల్లారావు, నంబూరి జనార్ధనరావు, పల్లపోతుల కృష్ణారావు,టి వెంకట్రావు,విజయ్ కుమార్, జె రమేష్,మాధురి తేజ తదితరులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 21 జూన్, 2026

# చెట్టమ్మా లీలమ్మ జన్మదిన వేడుకల్లో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ

-ముచ్చర్ల జెడ్పీహెచ్ఎస్‌లో రావి చెట్టును 'తల్లీ వృక్షం'గా ప్రకటించిన యంగ్ ఎర్త్ లీడర్స్
-విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యానికి పునాది

జూన్ 20 వార్త సాక్ష్యం



కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ అధ్యక్షురాలు చెట్టమ్మా ప్రకృతి మాత లీలా లక్ష్మారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కందుకూరు మండల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ ముచ్చర్ల పాఠశాలలో పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలోని రావి చెట్టును "తల్లీ వృక్షం"గా ప్రకటించి, విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నిర్వాహకులు, సీజీఆర్ సంస్థ ఇప్పటివరకు 36 లక్షల మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణలో విశేష కృషి చేసిందని తెలిపారు. అలాగే పాఠశాల విద్యాశాఖతో సంయుక్తంగా నిర్వహిస్తున్న "యంగ్ ఎర్త్ లీడర్స్" కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యత, పర్యావరణ చైతన్యాన్ని పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను తమ సామాజిక బాధ్యతగా భావించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ సంస్థ ప్రతినిధి రజనీకాంత్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రెవెన్యూ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

-ప్రజల అర్జీలపై నిర్లక్ష్యం సహించేది లేదు
-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

జూన్ 20 వార్త సాక్ష్యం




ప్రజల నుంచి వచ్చే అన్ని రకాల రెవెన్యూ దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా రెవెన్యూ అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న భూభారతి,సాదా బైనామా, ప్రజావాణి అర్జీలు,పౌర సేవల ధ్రువీకరణ పత్రాల జారీ పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజల నుంచి అందుతున్న అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా భూభారతి, ప్రజావాణి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం 60 రోజుల గడువు నిర్దేశించిందని,ఈ గడువులోపే ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పౌర సేవల కింద జారీ చేసే కులం,ఆదాయం, నివాసం,కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాల దరఖాస్తులను సత్వరమే పరిశీలించి అర్హులైన వారికి వెంటనే ఆమోదం తెలపాలని తహసీల్దార్లకు స్పష్టం చేశారు. దరఖాస్తులను తిరస్కరించే పరిస్థితి ఏర్పడితే, సంబంధిత కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్,భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,డి ఆర్ ఓ రాథోడ్ రమేష్,ఆర్డీఓ దేవీదాస్, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో కృషి చేయాలి






-వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి.
-జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా.

జూన్ 20 వార్త సాక్ష్యం

రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.
వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సమావేశానికి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు హాజరయ్యారు. రోడ్డు భద్రతా కమిటీ చైర్‌పర్సన్‌గా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్‌స్పాట్లను గుర్తించి, అక్కడ స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్డు మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాకాలంలో వరద నీరు నిలిచే రహదారులపై ప్రత్యేక దృష్టి సారించి, నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరచాలని పేర్కొన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేసి, దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రమాదకర మలుపులు, కల్వర్టులు, వంతెనల వద్ద ప్రతిబింబించే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, కల్వర్టులకు పసుపు రంగు వేయించి హెచ్చరిక గుర్తులు ఏర్పాటు చేయాలని సూచించారు. కరీంనగర్ నగరంలోని ప్రధాన రహదారులపై వీధి దీపాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వెలుతురు లేని ప్రాంతాల్లో అదనపు లైటింగ్ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వర్షపు నీరు రోడ్లపై నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థలను శుభ్రపరచడంతో పాటు ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడకుండా నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు మరింత బలోపేతం చేయాలని చెప్పారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, మానవ తప్పిదాలు, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీటుబెల్ట్ వినియోగిం చకపోవడం వంటి కారణాల వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో వర్షపు నీరు నిలిచే 16 ప్రాంతాలను ఇప్పటికే గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అలాగే పాఠశాలల పరిసరాల్లో జీబ్రా క్రాసింగ్‌లు, హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్ మాట్లాడుతూ, తీగలగుట్టపల్లి ఆర్ఓబీ వంతెన వద్ద రోడ్డు గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గిం చేందుకు సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని సమావేశంలో నిర్ణ యించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, టౌన్ ఏసిపి వెంకటస్వామి, ఆర్ అండ్ బి ఈఈ నరసింహ చారి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చింతకాని మండలంలో జరిగే సీఎం సభకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-మూడురోజుల పాటు నిర్వహించే రైతు మేళా ను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి..
-150 స్టాల్స్ ద్వారా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు..
-మధిర నియోజకవర్గంలో రైతు మేళా, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్..

జూన్ 20 వార్త సాక్ష్యం



చింతకాని మండలంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో రైతుమేళా నిర్వహించనున్నట్లు, అట్టి రైతు మేళా లో ఈ నెల 30 న ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నే సభ ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మూడురోజుల పాటు నిర్వహించే రైతు మేళా, ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. రైతు మేళా విజయవంతానికి పకడ్బందీ ప్రణాళిక, సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో కార్యచరణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఈనెల 28, 29, 30 తేదీల్లో మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో రైతు మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 150 స్టాల్స్ ఏర్పాటు చేసే ఈమేళాకు జిల్లా నుండి రైతులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని పండుగలా మార్చుకోవాలని, ఈ అవకాశాన్ని అన్న దాతలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. శాస్త్రవేత్తలు రైతు మేళాలో పాల్గొననున్నందున వారికి బస, రవాణా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతు మేళాకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డీవో శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డా. పురందర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, పిడి మెప్మా, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా నదీ తీర గ్రామాల్లో నీటి కష్టాలకు ఉత్తమ్ కొత్త ఆశలు

-రూ.394 కోట్ల లిఫ్ట్ పథకం సాకారానికి చేరువలో
-రైతుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న మంత్రి ఉత్తమ్

జూన్ 20 వార్త సాక్ష్యం



సూర్యాపేట: జిల్లాలోని వేలాది రైతు కుటుంబాలకు తరతరాలుగా అది ఒక బాధాకరమైన విరోధాభాస. కళ్ల ముందే ఉత్తుంగ తరంగాలతో కృష్ణా నది ప్రవహిస్తున్నప్పటికీ, వారి పొలాలు మాత్రం ఎప్పుడూ ఎండిపోయే ఉండేవి. శనివారం ఆ సుదీర్ఘ నిరీక్షణకు త్వరలోనే తెరపడనుందనే సంకేతాలు కనిపించాయి. నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వందలాది మంది రైతులు తరలివచ్చారు.అయితే ఈ వేడుకలు కేవలం పూలదండలు,కేరింతలకే పరిమితం కాకుండా, ఒక గొప్ప భరోసానిచ్చే విధంగా సాగాయి.ఉత్సాహంగా తరలివచ్చిన జనసందోహం మధ్య నిలబడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి,రూ.394 కోట్ల వ్యయంతో చేపడుతున్న రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం ప్రగతిని సమీక్షించారు.దశాబ్దాలుగా తీవ్ర నీటి కొరతతో అల్లాడుతున్న టెయిల్-ఎండ్ (చివరి ఆయకట్టు) ప్రాంతాలకు కృష్ణా జలాలను తరలించేందుకు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రూపొందించారు.మంత్రికి శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన చాలా మంది రైతులకు ఈ సందర్భం వ్యక్తిగతంగానూ, ప్రతీకాత్మకంగానూ ఎంతో ప్రత్యేకమైనది. తమ భూములకు శాశ్వతంగా సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు పూర్తి కావడమే ఈ ప్రాంతానికి లభించే అతిపెద్ద పుట్టినరోజు కానుక అని వారు పేర్కొన్నారు. ప్రాజెక్టు ముఖ్యాంశాలు ముక్తేశ్వరాపురం మేజర్, గణపురం మేజర్ ఆయకట్టు పరిధిలోని దాదాపు 14,000 ఎకరాలకు నమ్మకమైన నీటి సరఫరా అందించడం.అదనపు ప్రయోజనాలుగా కోదాడ, హుజూర్‌నగర్,చిలుకూరు మరియు పరిసర మండలాల్లోని చెరువులను నింపడం, నీటి భద్రతను మెరుగుపరచడం. ప్రస్తుత ప్రగతిని పరిశీలిస్తే .మొత్తం 22 కిలోమీటర్ల ప్రెజర్- మెయిన్ పైప్‌లైన్‌లో,16 కిలోమీటర్ల ఫ్యాబ్రికేషన్ పూర్తయింది. అందులో 6 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రధాన సివిల్ పనులు వేగంగా జరుగుతుండగా, మిగిలిన పనులు రాబోయే వారాల్లో మరింత వేగం పుంజుకోనున్నాయి. లబ్ధి పొందే గ్రామాలు ఈ ప్రాజెక్టు ద్వారా కందిబండ,రామాపురం, హుజూర్‌నగర్, కందిబండ, గణపవరం, కూచిపూడి, ఎర్రవరం, రామలక్ష్మీపురం, పీకే తండా, తొగర్రాయి, పాలనగరం తదితర గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ గ్రామాల రైతులకు ఈ ప్రాజెక్టు కేవలం ఒక ఇంజనీరింగ్ నిర్మాణం మాత్రమే కాదు, సాగునీటి సరఫరా వ్యవస్థలో చివరి భూములకు సైతం నీరు అందుతుందనే ఒక సుదీర్ఘ నిరీక్షణకు దక్కిన భరోసా. ఇప్పటివరకు వీరు కేవలం రుతుపవనాల పైన, అడుగంటుతున్న భూగర్భ జలాల పైన మాత్రమే ఆధారపడాల్సి వచ్చేది.ఈ పర్యటనలో రైతులను ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, టెయిల్-ఎండ్ ఆయకట్టులోని ప్రతి ఎకరానికి వారి న్యాయమైన నీటి వాటాను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. నీటిపారుదల అభివృద్ధి అనేది అత్యంత వెనుకబడిన రైతులకు సైతం చేరాలని, కాలువ చివరన ఉన్నారనే కారణంతో ఏ గ్రామానికి కూడా నదీ జలాల ఫలాలు అందకుండా పోకూడదని ఆయన నొక్కి చెప్పారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఈ ప్రాంతానికి ప్రధాన నీటిపారుదల జీవనాడి అయినప్పటికీ,లోటుపాట్లను భర్తీ చేయడానికి మరియు నీటిని సమానంగా పంపిణీ చేయడానికి రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం వంటి అనుబంధ ప్రాజెక్టులు ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో రూపుదిద్దుకుంటున్న భారీ పైప్‌లైన్‌పైనే ఈ ప్రాంత రైతులు తమ ఆశలన్నీ పెట్టుకున్నారు.కృష్ణా నదీ తీర గ్రామాల ప్రజల జీవితాల్లో,జీవనోపాధిలో ఈ నది త్వరలోనే ఒక నమ్మకమైన భాగస్వామిగా మారబోతోందన్నారు.

వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక
ఆదివారం 21 జూన్, 2026

# అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి

-జిల్లా రెవెన్యూ అధికారి రాంమూర్తి
-24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో కంట్రోల్ రూమ్ సేవలు..
-అత్యవసర సమయాలలో టోల్ ఫ్రీ నెంబర్ 1077 కు కాల్ చేయాలి...
-భారీ వర్షాలు, ఇతర అత్యవసర పరిస్థితులపై తక్షణ స్పందన..



జూన్ 20 వార్త సాక్ష్యం

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కలెక్టరేట్ లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. రాంమూర్తి శనివారం తెలిపారు. జిల్లా కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో నిరంతరాయంగా పని చేస్తుందని అన్నారు. భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు, తదితర అత్యవసర పరిస్థితుల సమాచారాన్ని ప్రజలు వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1077 లేదా మొబైల్ నంబర్ 9063211298 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి జిల్లాలో నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలు, ఇతరాలపై కూడా ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి కాల్, ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత శాఖలకు వెంటనే సమాచారం అందజేసి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయాల్లో కంట్రోల్ రూమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. రాంమూర్తి కోరారు.

# జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారం

-జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. ప్రేమలత



జూన్ 20 వార్త సాక్ష్యం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగ హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్‌పర్సన్ జి. ప్రేమలత మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా ప్రజలు తమ వివాదాలను సత్వరంగా, సులభంగా మరియు తక్కువ ఖర్చుతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు కేసులను పరస్పర రాజీ మార్గం ద్వారా పరిష్కరించే అవకాశం లోక్ అదాలత్ ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం మోటారు వాహన ప్రమాద కేసులలో రాజీ కుదిరిన బాధితులకు అవార్డు కాపీను అందజేశారు. కక్షిదారులకు పులిహోర మరియు మంచినీటి సదుపాయాన్ని ఎస్బిఐ బ్యాంకు వారి సౌజన్యంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. కిరణ్ కుమార్ న్యాయవాదులు, బ్యాంకు ప్రతినిధులు, కక్షిదారులు మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# కుంజా వనజ మృతిపై డా. రవీందర్ నాయక్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆరా

-ప్రోగ్రాం అధికారులతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష..

జూన్ 20 వార్త సాక్ష్యం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల గుండాల లో చోటుచేసుకున్న కుంజ వనజ మృతి ఘటనపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ & ఫ్యామిలీ వెల్ఫేర్ డా. రవీందర్ నాయక్ జిల్లాకు విచ్చేసి కుంజా వనజ మృతి సంఘటనపై సమగ్రంగా ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్, మరియు డాక్టర్ .రవిబాబు డిసీహెచ్ఎస్, సంబంధిత వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమావేశమై గర్భిణికి అందించిన వైద్య సేవలు, చికిత్స వివరాలు, రిఫరల్ ప్రక్రియ, సంఘటనకు దారితీసిన పరిస్థితులు తదితర అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు.సంబంధిత రికార్డులను పరిశీలించి, విధుల నిర్వహణలో ఎలాంటి లోపాలు జరిగాయో సమగ్రంగా విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విచారణ నివేదికను త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు.అనంతరం డైరెక్టర్ డా. రవీందర్ నాయక్ జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, మాతా-శిశు ఆరోగ్య సేవలు, కుటుంబ నియంత్రణ, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధుల (NCD) స్క్రీనింగ్, టీకా కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల పనితీరు, సికిల్ సెల్ అనీమియా నియంత్రణ కార్యక్రమం, క్షయవ్యాధి నిర్మూలన, కుష్ఠు నిర్మూలన, వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై కార్యక్రమాల వారీగా సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, పెండింగ్ అంశాలను వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

# మహిళా సాధికారత, యువతకు నైపుణ్యాభివృద్ధి

-మాదకద్రవ్యాల నిర్మూలనకు సమష్టి కృషి అవసరం
-జిల్లా కలెక్టర్ రాజర్షి షా

జూన్ 20 వార్త సాక్ష్యం

ఆదిలాబాద్ జిల్లాలో మహిళా సాధికారత,యువతకు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు.తెలంగాణ ప్రభుత్వ చొరవతో మహిళా సాధికారతను పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న నూతన 'ఎంప్లాయబిలిటీ స్కిల్స్ ట్రైనింగ్'కార్యక్రమం,'నషా ముక్త్ భారత్ అభియాన్' పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో విడుదల చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా ఎంప్లాయబిలిటీ స్కిల్స్ శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.అలాగే మత్తు పదార్థాల వినియోగ నిర్మూలనకు సమాజం లోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని యువతుల కోసం ప్రత్యేకంగా ఉచిత'ఎంప్లాయబిలిటీ స్కిల్స్'శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మహిళల్లో నైపుణ్యాభివృద్ధి,ఆర్థిక స్వావలంబన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. 2023, 2024, 2025, 2026 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల యువతులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు.శిక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ),సాఫ్ట్ స్కిల్స్,ఫ్రంట్ ఎండ్ డెవలప్‌మెంట్,ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్, పైథాన్ ప్రోగ్రామింగ్, ఫండమెంటల్స్ వంటి అంశాలపై 45 రోజులపాటు శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు.ఈ తరగతులు 2026 జూన్ 29 నుంచి స్థానిక టీటీడీసీ(టీ టీ డీ సి), డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభమవుతాయని తెలిపారు. దర ఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ జూన్ 26,అర్హులైన యువతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 95027 864380 నంబర్‌ను సంప్రదించవచ్చని, క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం, దివ్యాంగులు, వయోవృద్ధులు,ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ, ఈగల్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో "నషా ముక్త్ భారత్ సప్తాహ్" కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా జూన్ 17 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు"నషా ముక్త్ భారత్ అభియాన్,వికసిత్ భారత్ కి పహచాన్"అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన







కల్పించడం, సమాజంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మాదకద్రవ్యాల బారిన పడిన వారు లేదా సహాయం అవసరమైన వారు 14446 టోల్ ఫ్రీ నేషనల్ డీ-అడిక్షన్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే క్యూఆర్ కోడ్ ద్వారా మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ స్వీకరించడం, "నషా ముక్త్ మిత్ర" గా నమోదు చేసుకోవడం ద్వారా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల రహిత సమాజమే అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి పునాది అని పేర్కొంటూ, యువత, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి "నషా ముక్త్ భారత్ సప్తాహ్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ జగదీశ్వర్ రావు, డీడబ్ల్యూఓ మిల్కా, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యున్నత వైద్యం అందించేలా చర్యలు





-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

జూన్ 20 వార్త సాక్ష్యం

జిల్లాలోని పేద ప్రజలందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.శనివారం ఆయన నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న ఓపీ సేవల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సగటున నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు, ఏ విభాగాలకు చెందిన చికిత్సల కోసం ఎక్కువ మంది రోగులు వస్తున్నారో ఆరా తీశారు.అనంతరం ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని సందర్శించి,రోగులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించాలని, అవసరమైన వారికి తక్షణమే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు.రోగుల సౌకర్యార్థం వివిధ విభాగాలను సూచించే సైన్ బోర్డులను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రతి రికార్డును పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ విభాగాన్ని పరిశీలించిన ఆయన, ఇంకా పూర్తి కావాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శారద, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు 'పీఎస్ఆర్' భరోసా





-44 కుటుంబాలకు 10వేల చొప్పున ఆర్థిక సహాయం..
-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనతో ట్రస్ట్ వితరణ..

జూన్ 20 వార్త సాక్ష్యం

ఏదులాపురం : మున్సిపాలిటీ పరిధిలో గత నెల మరణించిన వ్యక్తుల కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కొండంత అండగా నిలిచింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు శనివారం బాధిత కుటుంబాలను నేరుగా కలిసి ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 44 కుటుంబాలకు ఒక్కో ఇంటికి 10,000 చొప్పున నగదును పంపిణీ చేశారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న తమను ఆదుకునేందుకు మంత్రి పొంగులేటి, ట్రస్ట్ ప్రతినిధులు ముందుకు రావడంపై బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు బానోత్ కిశోర్, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మీర అశోక్ నాయక్, గోనె భుజంగ రెడ్డి, వెంపటి రవి, వీరా రెడ్డి, మహేష్, భద్రకాళి, నూకల రామ్ మోహన్ రెడ్డి, రంజిత్ నాయక్, వెంకట నారాయణ, సాయి, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు పాల్గొని విజయవంతం చేశారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 21 జూన్, 2026

# బిజినెస్

## జియో రూ.37,700 కోట్ల ఐపీఓ




న్యూఢిల్లీ:
రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన టెలికాం, డిజిటల్ సేవల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ (జేపీఎల్) తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) కు రాబోతోంది. కంపెనీ బోర్డు నుంచి ఆమోదం లభించిన అనంతరం ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాల (డీఆర్‌హెచ్‌పీ)ను శుక్రవారం సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ 27 కోట్ల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో జియో వెల్లడించింది. ప్రస్తుత వాటాదారులు కూడా తమ వాటా నుంచి కొన్ని షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నారు. మొత్తంగా ఐపీఓ ద్వారా జియో ప్లాట్‌ఫామ్స్ 400 కోట్ల డాలర్ల (దాదాపు రూ.37,700 కోట్లు) వరకు సమీకరించే అవకాశం ఉందని సమాచారం. అంటే, దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇదే అతిపెద్ద కానుంది. బుధవారం నాడు సెబీకి ఐపీఓ పత్రాలు సమర్పించిన ఎన్ఎ?సఈ.. రూ.30,000 కోట్ల వరకు సేకరించనున్నట్లు తెలిపింది.ఐపీఓలో భాగంగా జియో ప్లాట్‌ఫామ్ మార్కెట్ విలువను దాదాపు 13,700 కోట్ల డాలర్ల (రూ.12.95 లక్షల కోట్లు) స్థాయిలో లెక్కించే అవకాశాలున్నాయి. అంటే, రిలయన్స్ జియో తర్వాత రెండో అతిపెద్ద టెలికాం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ ప్రస్తుత మార్కెట్ విలువ రూ.11.63 లక్షల కోట్ల కంటే అధికం. కాగా, ఐపీఓలో తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమకూరే నిధులను కంపెనీకున్న రూ.27,500 కోట్ల రుణాలను తిరిగి చెల్లించటంతో పాటు ఇతర వ్యాపార నిర్వహణ అవసరాలకు ఉపయోగించుకోనున్నట్లు జియో ప్లాట్‌ఫామ్స్ వెల్లడించింది. ఐపీఓ కోసం కంపెనీ 19 మర్చంట్ బ్యాంకింగ్ సంస్థలను నియమించుకుంది. కాగా, ఎన్ఎ సఈ తన ఐపీఓ కోసం అత్యధికంగా 20 మర్చంట్ బ్యాంకర్లను నియమించుకుంది.

## రోజూ ఫోన్‌పే వాడుతున్నా ఇనాక్టివిటీ నోటిఫికేషన్ వచ్చిందా?.. కారణం ఇదే!




ప్రముఖ డిజిటల్ పేమెంట్స్ సంస్థ ఫోన్‌పే... తమ వాలెట్లను చాలాకాలంగా వాడని యూజర్లకు 'ఇనాక్టివిటీ' నోటిఫికేషన్లు పంపుతోంది. దీనివల్ల చాలా మంది వినియోగదారుల్లో గందరగోళం నెలకొంది. తమ ఫోన్‌పే ఖాతా, యూపీఐ, వాలెట్ అన్నీ ఒకటేనని చాలామంది భావించడమే ఈ అయోమయానికి ప్రధాన కారణం. వాస్తవానికి ఈ మూడు వేర్వేరు చెల్లింపు సాధనాలని, వాటి పనితీరు కూడా భిన్నంగా ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు. డిజిటల్ చెల్లింపులు నిత్యజీవితంలో భాగమైన ఈ రోజుల్లో, ఈ తేడాలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

**-యూపీఐ, వాలెట్.. రెండిటికీ తేడా ఏంటి?**

చాలామందికి తెలియని ముఖ్య విషయం ఏమిటంటే, ఫోన్‌పే యాప్‌లో యూపీఐ, వాలెట్ అనేవి రెండు వేర్వేరు సేవలు.యూపీఐ: దీని ద్వారా మీరు చేసే చెల్లింపులకు డబ్బులు నేరుగా మీ బ్యాంకు ఖాతా నుంచి డెబిట్ అవుతాయి.ఫోన్‌పే వాలెట్: ఇది ఒక ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్ స్ట్రుమెంట్ (పీపీఐ). ఇందులో మీరు ముందుగా డబ్బులు లోడ్ చేసుకుని, ఆ తర్వాత ఖర్చు చేస్తారు. ఇది మీ బ్యాంకు ఖాతాతో సంబంధం లేకుండా పనిచేస్తుంది.ఫోన్‌పే విధిస్తున్న ఇనాక్టివిటీ రుసుము కేవలం ఫోన్‌పే వాలెట్‌కు మాత్రమే వర్తిస్తుంది. యూపీఐ ద్వారా బ్యాంకు ఖాతాతో చేసే లావాదేవీలకు ఈ ఫీజుతో ఎలాంటి సంబంధం లేదు.

**-నిజంగానే బ్యాంకు ఖాతా నుంచి డబ్బు కట్ అవుతుందా?**

వినియోగదారులను ఎక్కువగా ఆందోళనకు గురిచేస్తున్న ప్రశ్న ఇది. ఒకవేళ తమ వాలెట్‌లో బ్యాలెన్స్ లేకపోతే, ఇనాక్టివిటీ ఫీజును తమ బ్యాంకు ఖాతా నుంచి కట్ చేస్తారేమోనని చాలామంది భయపడుతున్నారు. కానీ, ఆ ఆందోళన అవసరం లేదని ఫోన్‌పే స్పష్టం చేస్తోంది. ఒకవేళ మీ వాలెట్‌లో బ్యాలెన్స్ జీరోగా ఉండి, అది చాలాకాలంగా ఇనాక్టివ్‌గా ఉంటే: మీ బ్యాంకు ఖాతా నుంచి ఎలాంటి డబ్బూ డెబిట్ అవ్వదు.యూపీఐ ద్వారా కూడా ఫీజును రికవరీ చేయరు. వాలెట్ బ్యాలెన్స్ నెగెటివ్‌లోకి వెళ్లదు.

## ఇక చౌకగా ఏఐ సేవలు!




ఆర్ఐఎల్ 49వ ఏజీఎంలో కీలక ప్రకటనలు చేసిన అంబానీ ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 49వ వాటాదారుల వార్షిక సమావేశం (ఏజీఎం) శుక్రవారం జరిగింది. దృశ్య శ్రవణ మాధ్యమంలో జరిగిన ఈ ఏజీఎంలో అంబానీ పలు కీలక ప్రకటనలు చేశారు. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు కంపెనీ బోర్డు ఆమోదం తెలపడంతో పాటు కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక వసతులు, సేవల విస్తరణ, శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్లోకి ప్రవేశం అందులో ప్రధానమైనవి.

**-జామ్‌నగర్‌లో ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి**

ఉచిత కాలింగ్, చౌక డేటా సేవల ద్వారా టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులకు తెరలేపిన రిలయన్స్.. ఏఐ సేవల విషయంలోనూ అదే వ్యూహంతో ముందుకెళ్తోంది. ఈ మధ్యనే స్థాపించిన రిలయన్స్ ఇంటెలిజెన్స్ సంస్థ ద్వారా 2030 నాటికి ప్రతి భారతీయుడికి ఏఐ సేవలను అత్యంత అందుబాటు ధరలో అందించాలనుకుంటున్నట్లు జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ తెలిపారు. "రిలయన్స్ భారత్ కోసం ఏఐని, భారత్‌లో ఏఐని అభివృద్ధి చేస్తోంది. ఆ ఏఐ ఒకరోజు ప్రపంచానికి సేవలందించనుంద"ని ఏజీఎంలో అన్నారు. ప్రస్తుతం దేశంలో ఏఐకి అతిపెద్ద అవరో ధాలైన.. కొరత, అధిక ధరను అధిగమించేందుకు రిలయన్స్ ఇంటెలిజెన్స్ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో దేశీయ ఏఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు అంబానీ తెలిపారు. కచ్ ప్రాంతంలోని రిలయన్స్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ద్వారా ఈ ఏఐ మౌలిక వసతికి శుద్ధ ఇంధనాన్ని అందించనున్నట్లు ఆయన చెప్పారు. తొలుత 120 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఈ ఏడాది చివరికల్లా అందుబాటులోకి రానుందన్నారు. ఇందుకోసం ఎన్‌విడియాకు చెందిన జీబీ300 జీపీయూలను వినియోగించుకోనున్నట్లు ఆయన చెప్పారు. ఇవి 75,000 హెచ్100 జీపీయూల సామర్థ్యంతో సమానమన్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాట్‌ఫామ్ కానుందన్నారు. భవిష్యత్‌లో ఈ సామర్థ్యాన్ని 2 లక్షల హెచ్100 జీపీయూల స్థాయికి పెంచనున్నట్లు ఆకాశ్ అంబానీ తెలిపారు.

## టీ20 ప్రపంచ కప్: భారత మహిళలు గెలుపు జోరు కొనసాగిస్తారా?

ఇంటర్నెట్ డెస్క్:
ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2026లో భారత మహిళలు వరుస విజయాలతో జోరు మీదున్నారు. ఆదివారం దక్షిణాఫ్రికాతో కీలక పోరుకు సిద్ధమవుతున్నారు. మాంచెస్టర్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో కూడా విజయం సాధించి సెమీ ఫైనల్ అవకాశాలను మరింత మెరుగుపర్చుకోవాలని హర్మన్ సేన పట్టుదలతో ఉంది. ఇప్పటికే పాకిస్థాన్, నెదర్లాండ్స్ జట్లను భారీ తేడాతో ఓడించి.. మెరుగైన నెట్ రన్ రేట్‌తో టీమిండియా గ్రూప్-1లో అగ్రస్థానంలో ఉంది.ఈ టోర్నీలో పాకిస్థాన్‌పై 64 పరుగుల తేడాతో, నెదర్లాండ్స్‌పై 95 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, వికెట్ కీపర్ రిచా ఘోష్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్నారు. దీప్తి శర్మ, శ్రీచరణి బౌలింగ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు. పాక్‌పై దీప్తి శర్మ 5 వికెట్లతో చెలరేగిన సంగతి తెలిసిందే. భారత్ విజయావకాశాలు టాప్ ఆర్డర్‌పైనే ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. పవర్‌ప్లేలో మంధాన దూకుడు, షెఫాలీ వర్మ విధ్వంసకర బ్యాటింగ్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ అనుభవం, రిచా ఘోష్ ఫినిషింగ్ సామర్థ్యం జట్టుకు ప్రధాన బలాలు. అదే సమయంలో బౌలింగ్ విభాగంలోనూ భారత్ సమతూకంగా కనిపిస్తోంది.

**-శ్రేయాంక స్థానాన్ని భర్తీ చేసేదెవరు?**




టీమిండియా స్టార్ ఆఫ్ స్పిన్నర్ శ్రేయాంక గాయం కారణంగా టోర్నీకి దూరమైన సంగతి తెలిసిందే. ఆమె స్థానంలో ప్రేమ రావత్‌ను జట్టులోకి తీసుకున్నారు. కీలక సమయంలో బ్రేక్ థ్రూ అందించే శ్రేయాంక లేకపోవడం జట్టుకు ఎదురుదెబ్బే. ఆమె స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారా? అనే అంశం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అయితే మరో స్పిన్నర్ రాధా యాదవ్ జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

**-సౌతాఫ్రికా సైలెంట్ కిల్లర్..**

దక్షిణాఫ్రికా జట్టు కూడా ప్రమాదకర ప్రత్యర్థే. ఈ టోర్నీలో ప్రోటీస్ జట్టు ఆస్ట్రేలియాపై ఓటమి తర్వాత పాకిస్థాన్‌ను రెండు వికెట్ల తేడాతో ఓడించి పుంజుకుంది. కెప్టెన్ లారా వోల్వార్ట్, మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు రాణిస్తే భారత్‌కు గట్టి సవాల్ ఎదురయ్యే అవకాశం ఉంది. మాంచెస్టర్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలించే అవకాశం ఉండటంతో భారత్ స్పిన్ దళం కీలకంగా మారనుంది. దీప్తి శర్మతో పాటు ఇతర స్పిన్నర్లు కూడా ప్రభావం చూపగలిగితే మ్యాచ్‌పై భారత్ ఆధిపత్యం చెలాయించే అవకాశాలు మెరుగవుతాయి. ఇప్పటివరకు భారత్‌కు అతిపెద్ద సానుకూల అంశం జట్టు సమిష్టి ప్రదర్శన. ఒక్క ప్లేయర్‌పైనే ఆధారపడకుండా బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలు సమష్టిగా రాణించడం జట్టుకు అదనపు బలం. అయితే ఒత్తిడిని తట్టుకుని తిరిగి పుంజుకునే సామర్థ్యం ఉన్న దక్షిణాఫ్రికాను తక్కువ అంచనా వేయలేం. ఇరు జట్లలోనూ మ్యాచ్‌ను మలుపు తిప్పగల ఆల్‌రౌండర్లు, మ్యాచ్ విన్నర్లు ఉండటంతో ఈ పోరు గ్రూప్ దశలోనే అత్యంత ఆసక్తికర సమరంగా మారనుంది. టైటిల్ రేసులో తాము బలమైన పోటీదారులమని నిరూపించుకోవాలంటే భారత్‌కు ఈ మ్యాచ్‌లో విజయం ఎంతో కీలకం.

## వైభవ్‌ను 'టార్గెట్' చేస్తారా? శ్రీలంక కెప్టెన్ సమాధానం ఇదే

స్పోర్ట్స్ డెస్క్:
శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు సిరీస్ తుది అంకానికి చేరింది. భారత్, శ్రీలంక 'ఎ' జట్లు టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యాయి. దంబుల్లా వేదికగా రేపు(ఆదివారం) ఇరుజట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో శ్రీలంక- 'ఎ' జట్టు కెప్టెన్ సహాన్ అరాచిగే టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశాడు.ఓ స్పోర్ట్స్ ఛానల్‌లో శ్రీలంక కెప్టెన్ సహాన్ మాట్లాడుతూ.. భారత్‌తో జరిగే తుది పోరు గురించి పలు విషయాలను వెల్లడించాడు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన వాగ్వాదం తర్వాత మీరు వైభవ్‌ను టార్గెట్ చేస్తారా? అని మీడియా నుంచి ప్రశ్న ఎదురైంది. అందుకు సహాన్ అరాచిగే సమాధానం ఇస్తూ... తాము ఫైనల్లో వైభవ్‌ని టార్గెట్ చేయబోమని తెలిపాడు. తమ వాళ్లు ఎవరినీ, ఏ విషయాన్ని కూడా ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకోరని, ఆటను తాము ఆస్వాదిస్తున్నామని పేర్కొన్నాడు. సూపర్ ఓవర్ లాంటి సందర్భాల్లో ఆటగాళ్లు భావోద్వేగాలకు లోనుకావడం సహజమని, ఆటలో ఇలాంటివి సాధారణమని అరాచిగే స్పష్టం చేశాడు. భారత్‌తో ఫైనల్‌కు తాము పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నామన్నాడు. బ్యాటింగ్ విషయం లోతముకు ఎలాంటి సమస్యా లేదని, తమ బౌలింగ్ విభాగంలో ఫాస్ట్ బౌలర్లు, స్పిన్నర్లు మెరుగ్గా రాణిస్తున్నారని పేర్కొన్నాడు. భారత్‌తో పోటీ కోసం తాము ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు అరాచిగే తెలిపాడు. కాగా లీగ్ దశలో తొలుత శ్రీలంకపై భారత్ ఎనిమిది పరుగుల స్వల్ప తేడాతో గట్టెక్కగా.. రెండో మ్యాచ్‌లో లంక సూపర్ ఓవర్లో విజయం సాధించింది. ఇక ఇరుజట్లు అఫ్గానిస్థాన్‌పై విజయం సాధించి ఫైనల్లో అడుగు పెట్టాయి.



# స్పోర్ట్స్

## ఆఖరి వన్డే: అఫ్గాన్ ఆలౌట్ భారత్ టార్గెట్ ఎంతంటే?



ఇంటర్నెట్ డెస్క్:
చెపాక్ స్టేడియం వేదికగా భారత్-అఫ్గానిస్థాన్ జట్లు మూడో వన్డేలో తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్.. 44.2 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. టీమిండియాకు 219 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అఫ్గాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిది(102) సెంచరీతో చెలరేగాడు. ఓ వైపు వరుసగా వికెట్లు పడుతున్నా.. క్రీజులో పాతుకుపోయి జట్టుకు గౌరవప్రదమైన స్కోర్‌ను అందించాడు. మరోవైపు భారత బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్లతో చెలరేగాడు. ప్రసిద్ధ్ బౌలింగ్‌లో రోహిత్ శర్మ మూడు సార్లు క్యాచ్ అందుకోవడం విశేషం.అఫ్గాన్ బ్యాటర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్(50) హాఫ్ సెంచరీ చేశాడు. 36 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన అఫ్గాన్‌ను.. హష్మతుల్లా, అజ్మతుల్లా ఆదుకున్నారు. వీరిద్దరూ కలిసి ఐదో వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇబ్రహీం జద్రాన్(11), మహ్మద్ నబీ(21) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 5, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబె తలొక వికెట్ పడగొట్టారు

## ఇదిగో మా క్లీంకార.. తొలిసారి కుమార్తెను చూపించిన రామ్ చరణ్, ఉపాసన... ఫొటో వైరల్




మెగా అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న క్షణం ఎట్టకేలకు వచ్చింది. రామ్ చరణ్, ఉపాసన దంపతులు తమ కుమార్తె క్లీంకార ముఖాన్ని తొలిసారి ప్రపంచానికి చూపించారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఉపాసన తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇప్పటివరకు కూతురు ముఖం కనిపించకుండా జాగ్రత్తపడిన ఈ జంట మూడో బర్త్‌డే రోజున అభిమానులకు ప్రత్యేక కానుక ఇచ్చింది. "మా అమూల్యమైన చిన్నారి క్లీంకారకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ ఉపాసన తన ఫేస్‌బుక్ ఖాతాలో అందమైన తమ ఫ్యామిలీ ఫొటోను పంచుకున్నారు. పచ్చని ప్రకృతి మధ్యలో రామ్ చరణ్, ఉపాసన తమ గారాల పట్టిని ప్రేమగా ఎత్తుకుని ఉన్న ఈ చిత్రం అభిమానులను ఆకట్టుకుంటోంది. నీలి రంగు దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తున్న చిన్నారి అందరి చూపును కట్టిపడేస్తోంది. బుగ్గల నిండా నవ్వు, కళ్లలో అమాయకత్వం, ముఖంలో మెరిసే ఆనందం ఫొటోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రుల ఒడిలో హాయిగా కూర్చుని నవ్వుతున్న మెగా వారసురాలు ఆ కుటుంబ చిత్రానికి మరింత అందాన్ని తీసుకొచ్చింది. కొందరు ఆమె కళ్లు తాత మెగాస్టార్ చిరంజీవి కళ్లలా ఉన్నాయని కామెంట్ చేస్తున్నారు. ఈ పోస్ట్ బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో శుభాకాంక్షల వెల్లువ మొదలైంది. మెగా అభిమానులతో పాటు సినీ ప్రముఖులు క్లీంకారకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మూడేళ్లుగా అభిమానులు ఎదురుచూస్తున్న ఆమె ఫేస్ రివీల్ కావడంతో ఈ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

# మా సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో అర్థం కావడం లేదు: షాహిద్ కపూర్ ఆవేదన

– షాహిద్, రష్మిక, కృతి సనన్ కాంబినేషన్లో 'కాక్‌టెయిల్ 2' మూవీ

–ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చిన సెన్సార్ బోర్డు

–ఈ చిత్రంలో ఒక్క అసభ్యకరమైన సన్నివేశం కూడా లేదన్న షాహిద్



బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్ హీరోగా, రష్మిక మందన్న, కృతి సనన్ మెయిన్ లీడ్స్‌లో నటించిన లేటెస్ట్ క్రేజీ మూవీ 'కాక్‌టెయిల్ 2'. భారీ అంచనాల మధ్య రీసెంట్‌గా థియేటర్లలోకి వచ్చిన ఈ ట్రయాంగిల్ లవ్ అండ్ ఎమోషనల్ డ్రామా సినిమాకు సెన్సార్ బోర్డ్ షాక్ ఇస్తూ 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ నిర్ణయంపై హీరో షాహిద్ కపూర్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ముచ్చటిస్తూ తీవ్ర అసంతృప్తి, ఆశ్చర్యం వ్యక్తం చేశారు.సెన్సార్ సర్టిఫికెట్‌పై షాహిద్ ఓపెన్‌గా స్పందిస్తూ.. "ఈ సినిమాలో ఎలాంటి అభ్యంతరకరమైన, అసభ్యకరమైన లేదా బోల్డ్ సీన్స్ అస్సలు లేవు. సినిమా మొత్తంలో అలాంటి ఒక్క సన్నివేశం కూడా మీకు కనిపించదు. ఇదొక పక్కా ఫ్యామిలీ ఓరియెంటెడ్ ఎమోషనల్ డ్రామా. మరి ఇలాంటి క్లీన్ చిత్రానికి సెన్సార్ వాళ్లు 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదు. ఎంత ఆలోచించినా లాజిక్ దొరకట్లేదు. ఇది ముగ్గురు వ్యక్తుల జీవితాల చుట్టూ తిరిగే కథ. కుటుంబ సమేతంగా థియేటర్లకు వచ్చి హ్యాపీగా నవ్వుకుంటూ చూసే సినిమా" అని చెప్పారు. మరోవైపు, టాక్‌తో సంబంధం లేకుండా ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ రాబట్టింది. మొదటి రోజే వరల్డ్ వైడ్‌గా దాదాపు రూ. 13 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా అనౌన్స్ చేసింది. ఈ వీకెండ్‌లో కలెక్షన్స్ రేంజ్ ఇంకా పెరిగే ఛాన్స్ ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# 'మా ఇంటి బంగారం'కు మంచి ఓపెనింగ్స్ మహిళా ప్రేక్షకులకు సమంత థ్యాంక్స్

-'మా ఇంటి బంగారం'కు తొలిరోజు భారీ వసూళ్లు

-ప్రపంచవ్యాప్తంగా రూ. 13.15 కోట్ల గ్రాస సాధించిన సినిమా

-సినిమా విజయంలో మహిళలదే కీలక పాత్రన్న సమంత

-ఈ చిత్రంలోని స్వర్ణ పాత్ర నా నిజ జీవితానికి దగ్గరగా ఉంటుందని వెల్లడి

సమంత ప్రధాన పాత్రలో నటించి, స్వయంగా నిర్మించిన చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. విడుదలైన తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా రూ. 13.15 కోట్ల గ్రాస్ వసూలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ భారీ విజయం పట్ల సమంత ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సినిమా ఓపెనింగ్స్‌కు మహిళా ప్రేక్షకులు భారీగా తరలిరావడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు.ఈ విజయంపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఒక నోట్ రాశారు. "మొదటి రోజు ఒక సినిమాకు ఇంత మంచి ఓపెనింగ్ రావడం చాలా ఆనందంగా ఉంది. యువత నుంచి పెద్దల వరకు అందరూ సినిమాను ఆశీర్వదించడానికి రావడం గొప్ప అనుభూతినిచ్చింది" అని ఆమె పేర్కొన్నారు. "థియేటర్లకు ఓపెనింగ్స్‌ను మగ ప్రేక్షకులే తెస్తారని చాలాకాలంగా వింటున్నాం. కానీ, ఈ సినిమాకు మహిళలు భారీగా తరలిరావడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. సినిమా ప్రేక్షకులు కూడా ఎదుగుతున్నారని అర్థమవుతోంది. మా చిన్న ప్రొడక్షన్ హౌస్ విజయం సాధించింది" అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు. ఇటీవలే ఓ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. 'మా ఇంటి బంగారం'లోని స్వర్ణ పాత్ర తన నిజ జీవితానికి చాలా దగ్గరగా ఉంటుందని సమంత తెలిపారు. తాను ఇప్పటివరకు చేసిన తెలుగు పాత్రలన్నింటిలో ఇదే తనకు అత్యంత ఇష్టమైనదని చెప్పారు. చిత్రంలోని యాక్షన్ సన్నివేశాల గురించి మాట్లాడుతూ.. "సినిమాలో స్లో మోషన్ షాట్లు, బిల్డప్ షాట్లు ఉండవు. నిజమైన పంచ్‌లు ఉంటాయి. నాకు కూడా దెబ్బలు తగిలాయి, రక్తం వచ్చింది. అన్ని యాక్షన్ సీన్లను నేనే స్వయంగా చేశాను. అందుకే అవి అంత సహజంగా కనిపిస్తున్నాయి" అని సమంత వెల్లడించారు.




## మనసుకూ విశ్రాంతి అవసరం.. సోషల్ మీడియాకు బ్రేక్ ప్రకటించిన హీరోయిన్



ప్రముఖ నటి కయాదు లోహర్ సోషల్ మీడియాకు తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. శరీరానికి విశ్రాంతి ఇచ్చినట్లే మనసుకు కూడా విశ్రాంతి అవసరమని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులకు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా కొంతకాలం విశ్రాంతి తీసుకుని, స్క్రీన్‌కు అవతల ఉన్న నిజ జీవితంతో మమేకం కావాలనుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఒక సుదీర్ఘ సందేశాన్ని పంచుకున్నారు. "సోషల్ మీడియా నుంచి చిన్న అడుగు వెనక్కి వేస్తున్నాను. కొన్నిసార్లు మనం శరీరానికి ఇచ్చే విశ్రాంతి మనసుకు కూడా అవసరం. నేను కాస్త నెమ్మదించి, డిస్‌కనెక్ట్ అవ్వాలని, స్క్రీన్‌కు అవతల ఉన్న జీవితంతో, నాతో నేను ఎక్కువ సమయం గడపాలని భావిస్తున్నాను" అని ఆమె తన పోస్ట్‌లో రాశారు. "నాకు మద్దతుగా నిలిచిన, ప్రోత్సహించిన, దయ చూపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రేమ, సందేశాలు నాకు ఎంతో విలువైనవి. నేను కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉంటాను, కానీ ఏవైనా ముఖ్యమైన అప్‌డేట్స్ ఉంటే నా టీమ్ ఈ ఖాతా ద్వారా పంచుకుంటుంది. అందరూ శాంతి, సంతోషం, దయతో ఉండాలని కోరుకుంటున్నాను. త్వరలో కలుద్దాం" అని ఆమె వివరించారు.

# 'అథిరడి' (సోనీ లివ్) మూవీ రివ్యూ!

అథిరడి' ఓ మలయాళ సినిమా. బాసిల్ జోసెఫ్ .. టోవినో థామస్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి, అరుణ్ అనిరుద్ధన్ దర్శకత్వం వహించాడు. మే 14వ తేదీన థియేటర్లలో విడుదలైన సినిమా ఇది. 30 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, 70 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. అలాంటి ఈ సినిమా, ఈ నెల 19వ తేదీ నుంచి 'సోనీ లివ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. యాక్షన్ కామెడీ జోనర్లో రూపొందిన ఈ సినిమా, ఐదు భాషల్లో అందుబాటులో ఉంది. సామ్ కుట్టి (బాసిల్ జోసెఫ్) ఇంజనీరింగ్ కాలేజ్ లో జాయిన్ అవుతాడు. ప్రశాంత్ తో కలుపుకుని తన కంటూ ఒక గ్యాంగ్ ను రెడీ చేసుకుంటాడు. గతంలో సామ్ కుట్టి అన్నయ్య 'జోసెఫ్' (సుకుమార్) కూడా అదే కాలేజ్ లో చదువుతాడు. ఆ సమయంలో 'ఆరోహణ్' అనే పేరుతో ప్రతి ఏడాది ఒక ఫెస్ట్ ను నిర్వహిస్తూ వస్తారు.ఒకసారి నిర్వహించిన ఫెస్ట్ లో తొక్కిసలాట జరగడంతో ముగ్గురు స్టూడెంట్స్ చనిపోతారు. అందుకు కారకుడు జోసెఫ్ అనే ముద్ర పడిపోతుంది. కాలేజ్ లో ఆ ఏడాది నుంచి ఆ ఫెస్ట్ ను నిషేదిస్తారు. తన గురించి ఆ కాలేజ్ లో ఒక చేదు అభిప్రాయం ఉండిపోవడం జోసెఫ్ ను మానసికంగా కుంగదీస్తుంది. ఆ కాలేజ్ లో ఆ ఫెస్ట్ ను మళ్లీ జరిపించి, తన అన్నయ్యతో పాటు అప్పటి బ్యాచ్ ను ఆహ్వానించాలనే ఒక బలమైన అభిప్రాయంతో సామ్ కుట్టి ఉంటాడు. అందుకు సంబంధించిన అతని ప్రయత్నాలను, స్వాతి ఆర్ కృష్ణ (రియా శిబూ) సపోర్ట్ చేస్తుంటుంది. కాలేజ్ లో నిర్వహించే ఫెస్ట్ లో పాడటానికిగాను, సింగర్ 'వినీత్ శ్రీనివాసన్' ను సామ్ కుట్టి ఒప్పిస్తాడు. అయితే ఆ సమయంలోనే స్ట్రీట్ సింగర్ అయిన కుట్టన్ (టోవినో థామస్)తో సామ్ కుట్టీ మిత్ర బృందం గొడవ పడుతుంది. వాళ్ల కారణంగా కుట్టన్ భార్య గాయపడుతుంది. కుట్టన్ పెద్ద గూండా అనీ, అతని పేరుపై చాలా కేసులున్నాయనే విషయం సామ్ కుట్టీకి ఆ తరువాతనే తెలుస్తుంది. అప్పుడు సామ్ కుట్టి ఏం చేస్తాడు?



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.